# యామిని

పెద్ద మంచం.

విశాలంగా వుంది.

పరుపులమీద తెల్లటి దుప్పటీమీద రంగు రంగుల పూలు.

ఆపువ్వులమీద, కాదు, ఆముళ్ళమీద లలిత పడుకుని వుంది.

ఆ పడకమీద మూడు తలగడాలున్నాయి.

రెండు పెద్దవి. ఒకటి చిన్నది.

ఒక పెద్ద తలగడామీద లలిత పడుకుని వుంది.

చిన్నదానిమీద బాబు నిద్రపోతున్నాడు.

ఇంకొక పెద్ద తలగడామీద –

ఇంకో పెద్ద తల – –

ఇంకో – – –

[లలితా ! అటు చూడు ఆ జలపాతం .... ఆ నీళ్ళల్లో ఆడుకునే రంగుల పిల్లలు ఎవరు తెలుసా .... ? నీ నవ్వులు !.... ఆజారే, నాట్యమాడే నీళ్ళు. ఏమిటనుకుంటున్నావు ........ నీ చూపులు ........ ఆ తడిసే బండలే నా గుండెలు ...

చాలు చాలు, అపండి కవిత్వం

ష్! కవిత్వంకాదిది నాత్వం – నాలలితత్వం లలితా ఇదే నేను...

*　　*　　*

లలితే సింహాసనస్థితే!

ఎస్సార్ –

ఈసారి 'మిగ్'లో నిన్ను పక్కన కూచోపెట్టుకుని పైకి, పై పైకి మేఘాలపైకి తీసుకువెళ్ళి చూపించనా?

ఊఁ!

ఏమి చూపిస్తానో తెలుసా?

ఏమిటో?

మేఘుడు మన పాదాలక్రింద పరచిన తివాసీమీద గంధర్వులవలె విహరించే మనల్ని చూసి కింస్త్రీలూ ....

కింస్త్రీ ఏమిటి మహాశయా?

మరి కింపురుషుడికి ఫిమినైన్ జెండర్ కింస్త్రీ కాదా?

చిన్నయసూరి కోప్పడతాడు ప్రభా!

చిన్నయసూరి, పెద్దయచంద్రి, పెద్దయసూరి చిన్నయచంద్రి అండ్ తంపెనీ కోప్పడినా, కిందపడినా ఆకాశానికి రాజులు మనం ... రాజూ రాణి రెక్కలు కట్టుకుని విహరిస్తుంటే, దేవతలే ఓర్వలేకుంటే, వారి అసూయలే అగ్నిజ్వాలలై.

ఐ?

ఐ, వెసూవియసులై, ఫ్యూజియామాలై ఇల మీదకు దిగాయట. మరీ అంత ఇది పనికిరాదుస్మీ ....]

అంది తాను ఆనాటిరాత్రి వెన్నెలరాత్రి. ఎన్నడూ ఎప్పుడూ ఇట్లాగే వుండిపోవాలనీ, ఆ వుంటూండడంలోనే తాను కన్నులు మూయాలనీ, ఆయన గుండెలోని ఆచోటే తన్ను ఏడేడు లోకాలకు తీసుకువెళ్లే విమాన మనీ

నమిశ్రన రాత్రి —

మనసులోని నిండుదనానికి మాటలు రూపం ఇవ్వలేని ఆరాత్రి —

'దేవతలే ఒర్వలేకుంటే — ?'

ఔను ! వోర్వకనే పోయారు.

ఏమి దేవతలు ?

ఎవరో ఎక్కడో తపస్సుచేస్తే తమ పదవులు పోతాయేమోనని బెదరే భీరువులు - నాట్యాలు - తపోభంగాలు - కోపాలు - శాపాలు - అసూయ కేమాత్రం అతీతులు కాని దేవతలు —

ఈలోకాన్నే దేవలోకంగా మార్చిన తమ దాంపత్యాన్ని చూసి కన్నుకుట్టిన దేవతలు -

ఆమె ఒత్తిగిల్లింది.

ఒత్తిగిలి, మూడవ తలగడా -

అది పెద్దది, దానిమీద బోర్లపడుకుంది.

ఆరాత్రి దీపపు వెలుగులో కూడా - తలగడా ఒరమీద తాను రంగు దారాలతో కుట్టిన అక్షరాలు – 'నా ప్రభాకు' మెరుస్తున్నాయి. ...

.. తడుస్తున్నాయి.

బాబు

పక్కకు తిరిగి పడుకున్నాడు. లలిత వాడి మీద చేయి వేసింది. వాడింకా దగ్గరగా దొర్లి, ముడుచుకుని పడుకున్నాడు.

[నాన్నారూ మైనస్ ...

కాదోయ్ -

మైనస్ పెట్టండి ముందు -

వోకే బాయ్ .... ఆ, చూచావా నీకు పళ్ళేదు రెడ్డూ ?

ఇదిగో ఈసారి పడుతుందండీ

ఏమండీ - పన్నెండవుతూంది - భోజనానికి లేవండీ -

ఉండమ్మా, ఈ బోరుతో నాన్న వోడిపోతారూ -

నిజంగానటరా !

ఔనమ్మా నాకేమో ఇరవైనాలుగు పాయింట్లూ - నాన్నకేమో పందొమ్మిదే ....

ఔను లలితా ! మధుర మధురమందస్మితా! నేనింకా టీన్స్‌లోనే వున్నవాడను... కేంటీన్స్‌లోనే భోంచేయువాడను...చేయకపోయినా వాడనుగాక వాడను ...

అబ్బబ్బ అతివాగుడుమాని ఈబోర్డ్ ముగించండి.

అమ్మా, నువ్వు నాసైడ్ వుండమ్మా.

అల్లాగేరా, నువ్వు ముందా వైట్‌నికొట్టు పుష్‌కొకి ఆ వైట్ అలా [illegible]ఉండా .... అమ్మా కొడుకూ కలిసి నన్ను ఓడిద్దామనా -

ఎస్, నాన్నగారూ, అమ్మా నాసైడే -

మరి నా సైడ్ ఎవరోయ్ ?

మీ అమ్మను పిలుచుకోండి

....అల్లాగే .... అర్జంటుగా తంతి ఇచ్చేద్దాం పైకి ... "సన్ [illegible]ంగ్ గేమ్ స్టార్ట్ ఇమీడియట్లీ"

మరి బొమ్మ దేవుడి దగ్గర వుందికదా తంతి ఎట్లా అందుతుంది నాన్నా

ఉంది లేవోయ్ మార్గం .... ఆ స్ట్రైకరిలా ఇవ్వు.

నాన్నా ... ఇదిగో రెడ్డు .... ఇదిగో ఫాలో .... వోచ్ - హోహో నాన్నోడిపోయారోహో - ఓడిపోయారోహో -

అన్యాయం లలితా, నువ్వు వాడిసైడ్ వుండి నన్నొంటరిగాచేసి ఓడించడం ఆదర్శవతియగు భారతసతి చేయదగిన పనికాదు -

చాల్లెండి - ఆ రూపాయేదో ఇచ్చుకుని లేవండిహ - ]

ఆట ....

కేరమ్స్ ఆట......రెడ్ కాయిన్‌కు ఫాలో వుండాలి....ఫాలో వెళ్ళక పోతే రెడ్ వెనక్కి వస్తుంది. ప్రభాకరుడికి ఛాయ తను. కాని ప్రాణం వెళ్ళిపోయినా దేహం ఇక్కడేవుంది. ఫాలో ఫాలోకాలేదు. ఇక్కడే వుండి పోయింది.

ఆటలో బాబుసైడ్ తను.

జీవితంలోనూ బాబుసైడ్‌న తనే మిగిలింది.

ఆటలోనూ, జీవితంలోనూ ఆయన అటుసైడ్.

ఆ కేరం ఆట సరే తాము ఆడారు, కాని

ఇదేమి ఆట, దీనినెవరాడుతున్నారు ?

[నో, నో, పిచ్చిపిల్లా - ఎన్నిసార్లు వెళ్ళలేదు - ఎన్నిసార్లురాలేదు - ఎన్నిసార్లు నీభయం అబద్ధంకాలేదు - ఎందుకలా భయం .... యుద్ధం త్వరలోనే అయిపోతుంది - మళ్ళీ వస్తాను. అప్పుడు నువ్వే నవ్వుతావు - ఎందుకంత భయపడ్డానాఅని - 65 లో ఎంతభయపడ్డావు - ఇచ్చోగిల్ వద్ద అంతప్రమాదాన్ని దాటి ఆఖరికి నేనురాలేదు - అన్ని పార్టీలూ విజయవంతంగా ముగించుకుని వచ్చాడుగా నీప్రభా

వచ్చారు .... నిజమే. కాని మీ రొచ్చేదాక క్షణం ఒక చావుగా నిముషమొక బ్రతుకుగా నేను - అనుభవించిన నరకం నాకేతెలుసు.

ఎంతో నిబ్బరంగలదానివి నువ్వే యిట్లా బెంగపెట్టుకుంటే ఎలాగచెప్పు .... మరింత పిరికిదానివయితే అలనాడు మీయింటికి పెళ్ళిచూపులకొచ్చినప్పుడే-తల నేలమీదకు వంచి, మాట్లాడకుండానే నువ్వు నాకు నచ్చావహో అని చెప్పానెందుకు-ఎయిర్‌ఫోర్స్‌పైలటయితే బాబోయ్ నాకొద్దు అనో, అలా కాకపోతే ఈ నల్లటి అబ్బాయినా, ఛీ, నే పెళ్ళాడను అనో చెప్పక పోయావా లలితాదేవీ.

మీకెప్పుడూ పరాచికాలే .... మీరెన్ని చెప్పినా నా భయం నాదే - వెళ్ళిరండి - జాగ్రత్తగా వెళ్ళిరండి.

ఎస్ మేడమ్

అనవసరంగా రిస్కులు తీసుకోకండి ... జాగ్రత్తగా, క్షేమంగా, క్షేమంగా ....

ఎస్ .... ఎసెస్ ....

.... రండి, వారానికో వుత్తరం రాయండి, ఏం

వోకే, మరీ ఫార్వర్డ్ బేస్‌లో వుంటేనో ఉన్నా సరే రాయాల్సిందే

సరేనండి సరే .... ముందస్తుగానే వోడజనుత్తరాలు రాసేసి జేబులో వుంచుకుంటా, టకటకి వారానికోటి పోస్టు చేస్తుంటా

టీక్ హై

అబ్బ అబ్బ .... ఇప్పుడుకూడా జోక్స్ ఎట్లావేస్తారండీ బాబూ - మీరి మనసా లేక రాయా

నా మనసు రాయ్‌కాదు, బోన్ అంతకన్నాకాదు, .... అదిగో నాకే నవ్వొచ్చేస్తుంది .... అవునా .... ఈనవ్వును వదిలి - నిన్నొదిలి బాబు నొదిలి - ఈ వెన్నెల నొద్దిలి- ఈ నందన వనాన్నొదిలి నేనుమాత్రం ఎన్నాళ్ళుండగలను లలితా - వస్తా - త్వరగా క్షేమంగా వస్తా]

వెళ్ళాడు ప్రభా

మొదలైయింది యుద్ధం.

'అగర్తలామీద పాక్ సేబర్ జెట్లు'

'విక్రాంత్ విమానాలచే పాక్ రేవుల ధ్వంసం'

'ఛాంబ్, పూంచ్ రంగంలో ఘోరయుద్ధం - బంగ్లాదేశ్‌కు భారత్ గుర్తింపు'

'జెస్సూర్ పతనం .... సింద్‌లో మన సైన్యాల ప్రగతి'

'కొమిల్లా బ్రాహ్మన్ బేరియాలు మన కైవసం'

'పాక్ సబ్‌మెరీన్ ఘాజి ముంచివేత'

'ఛాంబ్‌లో పాక్ ఎత్తుగడ విఫలం'

'హిందూ మహాసముద్రంలో సప్తమ నౌకాదళం : భారత్‌కు నిక్సన్ బెదరింపు'

'ఢాకా చేరువలో భారత్ సైన్యాలు ! షక్కర్‌గఢ్‌కోసం భీషణ పోరాటం'

దినపత్రికలు శీర్షికలు - వార్తలు - రేడియో వార్తలు - ఎక్కడ ప్రభా - ఎక్కడున్నాడు - ఉత్తరాలు రెండు వచ్చాయి 'అంతా క్షేమం. అనుకున్నట్లే జరుగుతున్నాయి' అన్నాయి...ఆఖరి వుత్తరం డిసెంబరు 11న వచ్చింది - పాక్ రేడియో వింటుంటే - ఆ గొంతు వింటుంటే ఒంటి మీద తేళ్లు పాకినట్టు - మనస్సనే జీసస్‌ను శిలువమీద మేకులతో కొట్టి నట్టు......189 భారత్ విమానాలు కూల్చామంటాడే ఆ రాక్షసుడు.... కాని ఆకాశవాణి మాత్రం పాకిస్తాన్‌వి 83 మనవి 41 పోయాయంది. ఆ నల్భై యొకటిలో నయినా ఆ ఒకటీ వుండకూడదుకద భగవాన్...

దూరాన నా రాజుకే రాయిడావో - ఈ రోజు నారాత తేరాల పాలో --

యుద్ధం అయింది'

ఇంక నాన్న వచ్చేస్తారు కదమ్మా

ఔనుబాబూ, వచ్చేస్తారు నాన్నగారికి ఎంతోపేరు వస్తుంది.

ప్రభుత్వంవారు మెడల్స్ ఇస్తారమ్మా

అవున్నాయనా అవును — మీ నాన్న - మీ నాన్నలాటి నాన్నలు కొన్ని వందలమంది, వేల, లక్షలమంది ఈ దేశాన్ని నిలబెడుతున్నారు. ఈ దేశాన్ని కాపాడుతున్నారు.

యుద్ధానికి వెళ్లడం అంటే ఎంతో ధైర్యం కావాలి కదమ్మా -

అవునురాబాబూ అవును

.... .... ...

ఎందుకమ్మా ఏడుస్తున్నావు

అబ్బే లేదురా, లేదు

బాబుగాడి మాటల గలగలతో - వాడికోసం వండుతూ, తింటూ - యంత్రంలా

ఆ వుత్తరాలు రెండు, పాతవి వంద, చదివి చదివి - రాత్రిళ్ల పీడకలలొచ్చిన - పారాయణాలు చేసి చేసి - నెమర్లువేసుకుని - భయానికి లొంగి లొంగి - లొంగకూడదనుకుని ధైర్యానికి టానిక్కులు పోసి పోసి - సహస్ర శీర్షాస్సహస్రాక్షస్సహస్రపాత్ సహస్రనామాలతో ఆ శక్తిని పిలిచి - పిలిచి వేడి వేడి - పాడి పాడి - చచ్చి, బ్రతికి - బ్రతికివచ్చి, నిముషాలు గంటలుగా - గంటలు రోజులుగా - రోజులు యుగాలుగా గడవగా గ-డ-వ-గా - -

సీమ సిటుకనగానే సెదరిపోతది మనసు

కాకమ్మసేత్తైన కబురంపడా రాజు

'శరణు పొందమని నియాజీకి మానెక్‌షా లేఖ'

'నియాజీ బేషరతుగా లొంగుబాటు'

ప్రధానిచే యుద్ధవిరమణ ప్రకటన - డాకా రాజధానిగా స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణ.

అమ్మయ్యా - చల్లగా వున్నాయి పతాకశీర్షికలు

గుండె కాస్త సర్దుకోవా లంటూంది,

కానీ ——

మాసిదోనియాలో అలెగ్జాండర్ భార్య ఎలా ఎదురు చూచింది - మాంచాల ఎంతగా వగచిందో బాలచంద్రుని రాకకోసం - నెల్సన్ ధర్మపత్ని ఎదలో ఎన్ని కార్చిచ్చులు భరించింది - నెపోలియన్ ప్రేయసి మనసున రగిలిన బడ బాగ్నులెన్ని - రోమెల్‌ని ప్రేమించిన పడతి కన్నులలో ఎన్ని ఆశలు ఎన్ని కలలు శిలలై కొడిగట్టుకున్నాయి....

మాంచాలే జోసెఫైనై లలితై -

లలితే లలితలై లక్షలాది - అర్ధాంగులై కాచుకుని కళ్ళు కాయలు కాయించుకుని

కూచున్నది చూచి ఆ యుద్ధానికే జాలివేసిందికాబోలు అయిపోయింది యుద్ధం.

అమ్మయ్య, ముగిసింది కృష్ణపక్షం.

శుక్లపక్ష పాడ్యమినాటి చంద్రుడేపాటి - ఈ పదిహేను తిథులూ గడిచేనా-పున్నమి వచ్చేనా -

బాబు వాళ్ళ నాన్నతో చేరి కేరమ్సు ఆడేనా -
తాను, ప్రభా నీడలో నీడయై వెలిగి వెన్నెలయే క్షణం వచ్చేనా ...
మనసులోనా బొమ్మ మసక మసకేసింది
దూరాన నారాజుకే రాయిడానో....

ఒక

నాటి

సంజె

వేళ

“చాంబ్ రంగంలో అయిదు
శత్రు విమానాలు కూల్చాక
తన విమానంతోపాటు కూలి
స్క్వాడ్రన్‌లీడర్ ఎ. ప్రభాకర్
వీర మరణం చెందారని
తెలుపడానికి చింతిస్తు
న్నాము............ ...”
తంతి !

తన జీవతంత్రులను తెంపివేసిన తంతి.

శుక్లపక్షపు చంద్రుడికి రాహువయిన ఎర్ర కాగితంముక్క,

తమ నందనవనాన్ని కబళించిన కాలకూట సర్పాల్లాంటి పంక్తులు

బాబూ–బాబూ—బా—బూ—

ఒక్క క్రూరార్క కిరణమ్ము ఉర్విపాలి
నా గులాబి సోలి తూలి నన్ను వీడ

"లలితా అటు చూడు ఆ జలపాతం - లలితే సింహాసనస్థితే - మేఘుడు మన పాదాల క్రింద -"

ఇప్పుడయినా ప్రభా! మేఘుడొక్కడే కాదు, సర్వసృష్టి మీ పాదాల క్రిందే వుంది- నాకేచోటులేక పోయింది ఆ పాదాల క్రింద ....

'అవును లలితా! నేనింకా టీన్స్‌లోనే వున్నవాడను. . .అన్యాయం లలితా. . .నువ్వు వాడిసైడు వుండి నన్నొంటరిగా చేసి వోడించడం..'

మీ టీన్స్ మీకు నూరేళ్ళయ్యాయి - ఎవరు ఎవరిని ఒంటరిగా వదిలారు ప్రభా - నన్ను వాడిసైడ్‌న వుండమనేగా తప్పుకున్నారు -

'ఎన్నిసార్లు వెళ్లలేదు, ఎన్నిసార్లు రాలేదు....ఈ నవ్వు వొదిలి, నిన్నొదిలి, బాబునొదిలి, ఈ వెన్నెలనొదిలి, ఈ నందనవనాన్నొదిలి నేను మాత్రం ఎన్నినాళ్లుండగలను లలితా వస్తా, త్వరగా, క్షేమంగా వస్తా —'

మాటలు మాటలుగానే మిగిలిపోయాయి ప్రభా! నా కల, నీ వాగ్దానం అట్లాగే వుండిపోయింది.

భవిష్యత్తు సముద్రతీరంలో

కట్టినవన్నీ పిచ్చికగూళ్ళే అయ్యాయి,

కనబడని వూహ కబళించింది

అందని రెక్క మంత్రించింది, నిమంత్రించింది.

పలుకులు మిగిలాయి ములుకులుగా

తలపులే తలుపులు - మూసిన తలుపులు - ఇంకెన్నటికీ తెరవని తలుపులు - అవతల మీరు - ఇవతల నేను

'దేవతలే ఓర్వలేకుంటే - వారి అసూయలే అగ్నిజ్వాలలై ....

ఔనౌను - దేవతలుకారు వాళ్లు రాక్షసులు

మానవులు కారు వాళ్లు జంతువులు

దేశరక్షణట - యుద్ధాలట

నరజాతి చరిత్ర సమస్తం

నానాజాతి రక్తసిక్తం ...

— "ఛాంబ్ రంగంలో డిసెంబరు పదకొండవ తారీకున ఆకాశం మీద శత్రువిమానాలు, నేలమీద శత్రువుల ఆర్టిలరీ దళాలూ ఎడతెరిపి లేకుండా మన స్థావరాలపై అగ్నివర్షం కురిపిస్తూంటే, స్క్వాడ్రన్ లీడర్ ఎ. ప్రభాకర్ అతిసాహసంతో తన గ్నాట్ విమానంలో శత్రువుల గుండ్ల వర్షాన్ని ఛేదించుకుని వెళ్ళి వారి విమాన స్థావరంమీద నిప్పు కురిపించి రెండు శత్రువిమానాలను ధ్వంసంచేసి వెనక్కువచ్చాడు. అదేరాత్రి మళ్ళీ అధికోత్సాహంతో వెళ్ళిన ప్రభాకర్ మరల మూడు శత్రువిమానాలను కూల్చి వెనక్కు వస్తుండగా శత్రువుల రాకెట్ దెబ్బకు అతడి విమానం కూలిపోయింది. అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించి, ప్రాణాలను సైతం లెక్కచేయక, పవిత్రమైన మాతృదేశ రక్షణ కర్తవ్యంలో వీర మరణం పొంది అత్యుత్తమ ఆదర్శాన్ని సృష్టించిన స్క్వాడ్రన్ లీడర్ ప్రభాకర్‌కు మరణానంతరం పరమవీరచక్ర పతాకాన్నివ్వాలని నిశ్చయించారు. వారి ధర్మపత్ని శ్రీమతి లలితా ప్రభాకర్ రాష్ట్రపతినుండి ఈ పతాకాన్ని స్వీకరిస్తారు ..."

లౌడ్‌స్పీకర్ల మీదుగా, ఆకాశవాణి మీదుగా సైటేషన్ పఠనం - చప్పట్లు-రిపబ్లిక్‌దినం పండగనాడు-ఢిల్లీ మహానగరపు రాజధాని కిటూ అటూ లక్షలాది ప్రజలు - సామాన్యులు - మాన్యులు - చప్పట్లు - జెండాలు - బెలూన్లు - బవునర్లు — బ్యాండ్‌లు - తోరణాలు — తొక్కిసలాటలు -

మధిస్తున్న పాలసముద్రం మధ్యనుదయిస్తున్న చంద్రునిలా ఆ సందోహం మధ్యనుండి నడచివస్తున్న శిలలా తెల్లని చీరలో లలిత -

– స్వీకరించింది.

రాష్ట్రపతికి నమస్కరించింది. ఆయన ప్రతినమస్కరించారు చప్పట్లు మారుమోగాయి.

పత్రికల్లో ప్రభాకర్ ఫొటోలు - రేడియోల్లో టెలివిజన్లలో ప్రభాకర్‌మీద ఫీచర్లు - డాక్యుమెంటరీలో, యూనిఫారంలో ప్రభాకర్, టేకాఫ్ ముందు ప్రభాకర్ -

జాతిగౌరవం - మహావీరుడు - పతకాలు - బిరుదులు - చప్పట్లు - ఉత్తమఆదర్శం - పవిత్ర కర్తవ్యం - పాతచింతకాయపచ్చడి - పాచిపళ్ళ దాసరి - డబడబ డబ - బడ బడ బడ - కచటతప - గసడదవ.

మాటలు -మాటలు - మాటలు -

అర్థంలేనిమాటలు అర్థాలుకల్పించిన మాటలు ద్వేషాన్ని కోపాన్ని జయించలేని మానవుడి ఇసుకకోటలు - యుద్ధాలనింకా ఆపలేని మారణ యంత్రపు సమిధల చిటపటలు నియండర్తాల్ యుగానికీ నేటికీ మధ్య జీససులేడు - బుద్ధుడులేడు - బాపూలేడు - బెర్ట్రండ్ రసెల్ లేడు. - కాని చెంఘిజుఖాన్ వున్నాడు. - తామర్లేన్ వున్నాడు - హిట్లరున్నాడు - ముసోలినీవున్నాడు - యహ్యాఖానున్నాడు - నిక్సనున్నాడు - అని చెప్పే చప్పుళ్ళు.

మనిషి మనిషిగా బ్రతకలేక -

మనిషిరక్తం మనిషి తాగుతూ -

దోపిడికి వాణిజ్యమనీ

పీకనొక్కేయడానికి సహకారమనీ

నెత్తురుతాగడాన్ని పవిత్రకర్తవ్యమనీ

ప్రబోధించే మారేడుకాయలు

నిజాన్ని ఎదుర్కోలేక, నిజం అద్దంలో తన ఆటవిక జీవనాన్ని చూచుకొనే నిజాయితీలేక, ధైర్యంలేక ఇరవయ్యో శతాబ్దపు మనిషి ఏర్పరచుకున్న అందాల భ్రమలు ....

[ప్రభా ఎన్నిపతకాలు - ఎన్ని బిరుదాలు - ఎన్ని చప్పట్లు - ఎన్ని ప్రశంసలు - ఎన్ని పొగడ్తలు - ఈ మనసులోని అగడ్తను పూడ్చగలవు.

ఈ అగ్గిపుల్లలు ఎన్నివెలిగిస్తే నా చంద్రుడికి దీటయ్యేను. - ఈ మిణుగురు పురుగులు ఎన్నివెలిగితే నారాత్రి పున్నమి అయ్యేను - చిల్లర దేవుళ్ళు ఎందరెటు వూరేగితే నేమి ఈ ఆలయంలో దేవుడులేకపోయాడు కదా - ముళ్ళపొదలు ఎన్నిపెరిగితే నేమి ఈమొక్కకు కిరీటమైన ఏకైక పుష్పం రాలిపోయిందికదా -]

రాత్రి బరువుగా వుంది. బరిసె పోటులా వుంది.

చీకటిగా వుంది. చిచ్చులా వుంది.

— పడకమీద పొర్లింది లలిత.

ఏడాదినుండి పొర్లుతూనే వుంది. దొర్లుతూనే వుంది. మనస్సు కొలిమిలో కాలుతూనే వుంది.

కాని ఈనిప్పు వేరుగా వుంది.

ఇవాళ ఏమిటి -

ఏమి టేమి టేమిటి -

ఎవరోహో ఈనిశీధి

నెగసి నీడవోలె నిలిచి

పిలుతురెవరీ -

లలిత లేచింది - నడిచింది - కూచుంది - పడుకుంది - చదివింది - కళ్ళుమూసుకుంది - పొర్లింది - ప్రార్థనలు చేసింది - లేచింది

భగ్గుమంది.

హహ హహా

ఎవరు - ఎవరు వారెవరు మీ రెవరు ?

మేముకాదు నేను -

నేనుకాదు నువ్వు -

నీలో సగం నేను - నాలో సగం నువ్వు

సగం సగాన్ని వెతుక్కుంటూంది.

సగం సగంకోసం సమానాంతరంగా పరుగులిడుతూంది — నాచేతిలో మరవు నువ్వు - నాచేతిలో దొరవూ నువ్వే - దొరసానివీ నువ్వే - రంగుల రాట్నంమీద త్రిప్పినప్పుడు నన్నెరగవు కదూ - వెన్నెల కిరణాల అంచులమీద కూచోపెట్టి నేను నిన్ను ఆకాశానికెత్తుకు పోయినప్పుడు నన్ను నువ్వు గుర్తించలేదు కదూ - కాలాల్ని స్థలాన్ని స్తంభింపచేసి జల పాతంలాగ వర్షించి మెరుపులతో మీకు అభిషేకాలు చేశానే అది నేనేనని

తెలియదు కదూ - తెలుసుకోమరి - ఇప్పుడు తెలుసుకో నేను నీరక్తంలోని నీవని - నీలోలోన దాన్ని - ఆస్ట్రోజెన్ని - ఎగసే నిప్పుని - పారే నీటిని - లిబిడోని - టార్పెడోని టార్నాడోని — కమాండోని - అనంత కోటి నాల్కలనోటిని — నీ జననిని

— జననీ జనకుల జననిని ... హాహాహాహ భగవాన్ భగవాన్

భగవాన్ — ఉన్న అగ్నిపరీక్షలు చాలవా — ఇంకా ఇదెందుకు ...

'అమ్మా !' బాబుకేక. నిద్రలో పీడకల కాబోలు.

పరుగెత్తుకెళ్ళింది లలిత. ఒడిలో పడుకోబెట్టుకుంది. జో కొడుతూ ఉంటే నిశ్చలంగా నిద్రపోసాగాడు ప్రభా ... కాదు కాదు బాబు.

వాడి తలను తొలగించి పెద్దతలగడామీద పడుకోబెట్టింది లలిత.

లేచింది. వరండావైపు కిటికీని తెరిచింది.

తోటలోని పూలవాసనలతో గాలి ఘుప్పుమంది.

తూరుపుదెస, ఉదయపు దొరకోసం వాకిలి చిమ్ముతూంది.

నీళ్ళు చల్లుతూంది.

ముగ్గులు పెడుతూంది.

★